# కలలు పండిన రోజు

ప్రొద్దున్న పదిన్నరవేళ సుధాకరం పడక్కుర్చీలో పడుకుని తదేకంగా తన ముఖాన్ని అద్దంలో చూసుకుంటున్నాడు. అతనికి తీరుబాటు వున్నప్పుడల్లా యీ పని చేస్తుంటాడు. కనుబొమలు పైకెత్తి, క్రిందికి దింపి, పెదిమలు విరిచి, బిగించి, మీసం వ్రేళ్ళతో సవరించుకుని, కళ్ళు చికిలించి, ప్రక్క చూపు చూసి రకరకాల విన్యాసాలలో, అవకారాలలో అభినయం చేస్తుంటాడు. అద్దంలో స్వంత ముఖాన్ని చూసుకోవడం కంటె సరదా అయిన సంగతులు అతనికి జీవితంలో ఆట్టే లేవంటే అతిశయోక్తి కాదు. కానీ పాపం—ఒక సంగతి అందరూ వప్పుకుంటారు. ఆ ముఖం ఎంత సేపు చూసుకున్నా తప్పు పట్టడానికి వీల్లేదనీ, అతను పేరుకే కాక, రూపురేఖావిలాసాల్లో కూడా సుధాకరుడేనని.

అతను బి. కాం. ప్యాసై సంవత్సరన్నరయింది. ఎమ్. కామ్ కి దరఖాస్తు పడేశాడు. సీటూ వచ్చేదే. కానీ గట్టి ప్రయత్నం చేయడానికి డబ్బు లేదు. నాలుగైదు చోట్ల ఉద్యోగాల కోసం కూడా దరఖాస్తులు పడేశాడు. కానీ కాలేజీలో సీటు దొరకడమే కష్టమంటే, ఉద్యోగం దొరకడం

కష్టతరం. కాలేజీ జీతం కట్టడానికే డబ్బులేకపోతే ఉద్యోగం సంపాదించడానికి డబ్బు ఎక్కణ్ణించి వస్తుంది? రాను వచ్చినా నాన్న కామేశ్వర్రావు చేసిన అప్పులు తీర్చడానికి కావాలి. తనకున్న కొద్దిపాటి శక్తిలో కొడుకు బి. కాం. ఫస్టున ప్యాసయ్యేవరకు విజయం సాధించగలిగాడు. సుధాకరం చెల్లెలు పద్మిని పి. యు. సి. ప్యాసై ఆపేసింది. ఆఅమ్మాయి తర్వాత వారు యిద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లవాడు స్కూళ్ళల్లో వున్నారు. వాళ్ళంతా చదువుల్లో గట్టెక్కాలి పెళ్ళి పోటీల్లో నెగ్గాలి. కాబట్టి క్యూలో మొదటివాడైన సుధాకరం తనకి అనువైన పద్ధతిలో ఎక్కడో ఒకచోట స్థిర పడటం అత్యవసరం.

"అన్నానికి రావుట్రా?" అన్నది సుధాకరం వాళ్ళమ్మ రామలక్ష్మి. ఆవిడ ఒక పావుగంటనుంచీ. రెండు మూడు సార్లు చెప్పింది ఈ చిన్న డైలాగు పిలుస్తూంది. మళ్ళీ ఏదో పనిలో పడిపోతుంది. మళ్ళీ గుర్తువచ్చి పాట పల్లవిమల్లే ఆ మాట అంటుంది. స్వీయసౌందర్యావలోకనంలో పడిపోయిన సుధాకరం మూడో పిలుపుకి "వ్రు" అన్నాడు.

"రా మరి– నేనూ తిని ఒకనిముషం పడుకుంటాను. మళ్ళీ వాళ్ళొస్తారు. ఈ పద్మ తల్లి ఎవరింటికో పోయింది. ఇంతవరకూ అయిపులేదు" అన్నదామె.

సుధాకరం అద్దం కిటికీలో పెట్టి వళ్ళు విరుచుకుని వంటింట్లోకి నడిచాడు. కొడుకుగానీ, భర్తగానీ భోంచేస్తోంటే

రామలక్ష్మి తప్పనిసరిగా ప్రస్తావించే విషయాలు రెండు మూడున్నాయి. వాటిలో ఒకటి ఆమె యివాళ ప్రారంభించింది.

"పోనీ కృష్ణమూర్తి గారింటికి వెళ్ళి ఇంటర్వ్యూ కార్డు వస్తుందో రాదో తెలుసుకోక పోయినావూ?" అని. అది ఒకానొక ప్రైవేటు కంపెనీ ఉద్యోగం సంగతి. సుధాకరం మాట్లాడలేదు—అసలు మాట్లాడడు ఈ విషయం.

ఆమె కొడుకుని పరీక్షగా చూస్తూ కూర్చున్నది. కొంచెం ఆగి, "పద్మనికి ఫ్రెండట వెంకటరత్నంగారి అమ్మాయి ఆయనకి బ్యాంకులన్నిటిలో బోలెడుడబ్బున్నదిట. ఆయన తలుచుకుంటే ఎల్లాంటి వాళ్ళకీ ఉద్యోగాలవుతున్నాయి. ఎందుకూ మనకి వెన్న తెచ్చే పున్నమ్మ లేదూ దానికొడుక్కి రెండు వందలా పాతిక రూపాయల ఉద్యోగం వేయించాట్ట. చెల్లాయితో కలిసి ఓసారి వాళ్ళయింటికి వెళ్ళి రాకూడదట్రా?" అన్నదామె చాలాఆశగా, ఉత్సాహంగా.

సుధాకరం తల్లివంక చూసి. "మనకి ఎక్కడ వస్తాయమ్మా—దానికి చాలా పద్ధతులుంటాయి" అన్నాడు.

"నువ్వల్లా అనుకుంటే ఎలాగు - నాన్నగారు చాలా ముక్కుసూటి మనిషి. ఆయన వెడితే జరిగే పనులు కూడా చెడిపోతాయి" అన్నదామె. ఈ మాటమీద సుధాకరం రాజకీయ నాయకునికి మల్లే జాగ్రత్తపడి ఏమీ వ్యాఖ్యానించకుండా భోజనం పూర్తి చేశాడు.

—ఇటువంటి నిరుద్యోగ, అనిశ్చిత స్థితి మరో నాలుగు నెలలు సాగింది ఆ ఇంట్లో. ఇరవై రెండేళ్ళ పొగరు వయస్సు సుధాకరం మరో ఐదేళ్ళ వయస్సు పైన బడినట్లు నడవడం సాగించాడు. ముద్ద గన్నేరు పూవులాంటి పద్మిని నేస్తురాండ్ర యిళ్ళకి పెత్తనాలు తగ్గించి అమ్మని అంటి పెట్టుకుని వుంటోంది. మిగతావాళ్ళంతా షరా మామూలే అన్నట్లు స్కూళ్ళకు వెళ్ళి వస్తున్నారు. ఒకనాడు కామేశ్వర్రావు హఠాత్తుగా భోజనం దగ్గర ఒక ముఖ్య విషయం ప్రస్తావించాడు— అది సుధాకరం పెళ్ళిగురించి. రామలక్ష్మి పులుసు పోస్తున్నదల్లా గరిట అల్లాగే పట్టుకుని వుండిపోయింది. ప్రస్తుతాంశాల్లో పద్మకి పెళ్ళి, సుధాకరం ఉద్యోగం వున్నాయి గాని సుధాకరం పెళ్ళి లేనేలేదు.

"వెంకటరత్నంగారి అమ్మాయంటే— మన పద్మంతో చదువుకున్న పిల్లేనా? ఎల్లావుంటుంది?" అన్నాడు.

"ఇప్పుడెందుకొచ్చింది ఆ మాట?" అన్నదామె.

"ఎందుకో వచ్చిందిలేగానీ— పద్మా. అమ్మాయీ..." అని కేక వేశాడు.

"అబ్బ! అదెందుకండీ— మనం ముందు మాటాడుకున్నాక కదా పిల్లలతో చెప్పేది? వెంకటరత్నంగారు అడిగాడా?"

"ఆయన అడుగుతాడా ఏమిటి? ఎవరిద్వారానో కబురుచేశాడు. చూస్తావేమిటి వడ్డించక? నాకు టైమవుతోంది" అని హడావిడి పడుతూ భోజనం పూర్తిజేశాడు.

మాంచి రసపట్టులో వున్న నవల చదువుతోండగా మధ్య పేజీలు చిరిగిపోతే ఎల్లావుంటుంది.? చాలా బాధగా వుంటుంది. అటువంటి బాధలోనే పడిన రామలక్ష్మి ఆయన వెళ్ళాక కూతురు పద్మినితోనే మిగతా సంభాషణ సాగించింది.

"ఎవరూ అరుణా! అరుణకి యింకో అక్కయ్యుందిగా? తనకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు" అన్నది పద్మిని.

"అల్లాగా! ఎన్నేళ్ళుంటాయేమిటి! బాగుంటుందా?" అన్నది తల్లి.

"అయ్యో— సుబ్బలక్ష్మి— ఏమీ బాగుండదమ్మా నాకంటే ఏడాది పెద్దది. ఎందుకమ్మా యిప్పుడివన్నీ?" అన్నది కుతూహలంగా.

ఆ పిల్ల ఏమీ బాగుండదు అన్నమాట బాగా నాటింది రామలక్ష్మి చెవుల్లో. "బాగుండక పోవడమంటే నలుపా—" అన్నదామె సందేహంగా.

"పెద్ద నలుపేమీ కాదుగానీ— నోరు అదోలా వుంటుది. కళ్ళు కూడా— ఏమిటో నాకేమి బాగుండవు. ఇదంతా ఎందుకంటే చెప్పవేం!" అన్నది విసుగ్గా పద్మిని.

రామలక్ష్మి చెప్పింది. సుధాకరానికి ఆ అమ్మాయి నిద్దామన్న ఆలోచన వచ్చిందని.

"ఛీ— అన్నయ్యకా?" అన్నది పద్మిని అసహ్యంగా ముఖంపెట్టి.

ఇలా ఇంట్లో యథాలాపంగా, యిష్టాగోష్ఠిగా ప్రారంభమైన సంగతి మరో పది రోజులకే పెను సమస్యగా మారి సుధాకరం మనస్సులో సుడిగాలి లా వీచసాగింది. వెంకటరత్నంగారు పరపతి కల మనిషి, డబ్బున్న వాడు—అంటే డబ్బు మూలుగుతున్నవాడు. తలచుకుంటే ఒక్క పూటలో ఆరుగురికి వుద్యోగాలకి సిమెంటులాంటి మంచి సిఫారసులు చేయగలడు. ఇవన్నీ గుర్తించ దగిన విషయాలు.

ఇకపోతే... సుబ్బలక్ష్మి సుధాకరం కంటే సరిగ్గా పదకొండు నెలలే చిన్నది. చూపులకు ఏమీ బాగుండదు. సన్నగా జబ్బుగా వున్నట్లుంటుంది. ఆకర్షణ లేదు. అందంలేదు. పచ్చని పసివాడు సుధాకరం ముందు పూర్తిగా దిష్టిబొమ్మకు మల్లే వుంటుంది. ఇవి కూడా గుర్తించదగిన విషయాలే.

వద్దు వద్దనుకుంటూనే యింటిల్లిపాదీ వెళ్ళి చూసి వచ్చారు సుబ్బలక్ష్మిని. రామలక్ష్మి చాలా బాధపడింది ఆ పూట. సుధాకరానికి యిల్లాంటి పిల్ల నిస్తాననడానికి వారికి మనస్సెలా వప్పిందని. పద్మినికి ఆ పిల్లని తన వదినగా వూహలోనైనా ఆమోదించడానికి యిష్టం లేకపోయింది. కామేశ్వరరావు మనస్సు తన కొడుకు అభిప్రాయం తెలుసుకోవాలని ఆరాటపడింది. ఆ పిల్ల తన యింటి కోడలిగా వస్తే తీరే సమస్యలు చాలా వున్నాయి. మొదటిది, కట్నం

సొమ్ముతో కొన్ని నెత్తిమీదకు వచ్చిన బాకీలు తీర్చడం, రెండోది పెళ్ళికి ముందో, తర్వాతో సుధాకరానికి లక్షణమైన ప్రొబేషనరీ ఆఫీసరు వుద్యోగం రావడం.

ఆ రాత్రి సుధాకరానికి తీరుబాటు వుంది. అందరూ పడుకున్నాగానీ, ఒక్కడూ ఒక పుస్తకం ముందు పెట్టుకుని కూర్చున్నాడు. కళ్ళు అక్షరాలని చూస్తున్నాయి గానీ చదివింది అర్థం కావటంలేదు. పుస్తకాల్లోను, కథల్లోను అబ్బాయిలు, అమ్మాయిలు జీవితాన్ని గురించి కలలు కంటూ వుంటారు. పాపం నిజజీవితంలోనూ తీరుబాటున్నప్పుడు కలలు కంటారు. వుద్యోగాన్ని గురించి, పెళ్ళిని గురించి.

అల్లాగే పెద్దకళ్ళు, నొక్కుల జుత్తు అందగాడు సుధాకరం తను సినీ నటుణ్ణయి పోతానని కలలు కన్నా తప్పులేదు. అంతేకాక తనకి సన్నని, పొడుగాటి అందమైన అప్సరస భార్యగా దొరుకుతుందని రహస్యంగా ఆపేక్షపడ్డా ఆశ్చర్యం లేదు. తన కలలన్నీ పండే రోజు వస్తుందనే అనుకున్నాడు. రాత్రి వుదయంగా మారబోతున్న వుషస్సులో నిద్ర, మెలకువ కాని మధురావస్థలో అతనికి కనుపించిన అందమైన అమ్మాయిలో ఎవరో ఒకరు తన కేలు అందించే శుభతరుణం రానేరాదేమో.

సుబ్బలక్ష్మి- పెళ్ళీడు ఆడపిల్ల. అంతకంటే ఆ పిల్లని గురించి ఆలోచించడానికేముంది! ఆమెను చూశాడు, ఇబ్బందిగా గొంతులోకి వచ్చిన చిన్న బాధని దిగమ్రింగి, భయంగా

కళ్ళు యివతలకి త్రిప్పుకున్నాడు. ఆ అరక్షణంలో ఆమె మరింత భయంగా తనవంక చూసింది. ఇదేనా పెళ్ళి చూపు లంటే? నాన్న చూపుల్లో కొడుకుని గురించి సందేహం వెంకట రత్నంగారి చూపుల్లో ఆశ కనిపిస్తే, అమ్మ, చెల్లి చూపులో బాధ కనబడింది. వాళ్ళు నిష్కర్షగా చెప్పారు ఆ సంబాధం వద్దని.

కానీ– యీ "కానీ" అన్న సందేహం పైనే ఎంతో ఆశ. కుటుంబ భవిష్యత్తు ఆధార పడివున్నాయి. ఇరవై ఏళ్ళ నిరుద్యోగి. తన తరువాత నలుగురు సంతానాన్ని ఉద్ధరించ వలసిన వంశ చంద్రుడు– పరిష్కరించవలసిన అతి ముఖ్యమైన సమస్యలు ఒక గుప్పెడు ఈ 'కానీ' లో ఇమిడి వున్నాయి.

అందరి తలలూ ఒకలాగే వుండవు. అల్లాగే అందరి కలలూ ఒకలాగే పండవు. కొన్ని కసుగాయలుగానే రాలి పోతాయి. కొన్నిటిని దోరగానే చిలుకలు ఉడుతలు కొరికి పాడుచేస్తాయి... నవయువకుడు సుధాకరం ఒక ప్రొబేషనరీ ఆఫీసరు పోస్టునీ, ఆరువేల రూపాయల కట్నాన్నీ వీటితోపాటు వచ్చే సుబ్బలక్ష్మి అనే వధువునీ వరించి ఒక శుభముహూర్తాన పెళ్ళి చేసుకున్నాడు.

"ఎందుకు లక్ష్మీ?" అన్నాడు సుధాకరం. సుబ్బలక్ష్మి మాట్లాడక, ఏమీ లేదన్నట్లు తల అడ్డంగా ఆడించింది.

“ఏమి లేకపోవడం ఏమిటి? తీరికూచుని ఎందుకు ఏడుస్తావు మరి?” అన్నాడు కొంచెం చీకాకుగా.

ఆమె మాట్లాడలేదు. “చెప్పకు పోనీ, నీకిదో పెద్ద జబ్బయిపోయింది-ప్రతిదానికీ” అన్నాడు.

ఆమె కళ్ళల్లోని నీరు గట్టిగా అద్దేసుకుంది. కానీ బావిలో వూటలా మళ్ళీ కమ్మింది నీరు. “నవ్వుతూ కులాసాగా వుంటే ఎల్లాటి ముఖాలూ బాగానే వుంటాయి. ఏడుస్తోంటే యిక చెప్పనే అక్కరలేదు.” అనేసి బయటికి వచ్చేశాడు.

పెళ్ళయి సరిగ్గా ఏణ్ణర్ధం అయింది. అతను ఎన్నో వూళ్ళల్లో ట్రైనింగు పూర్తి చేసుకుని వున్న వూళ్ళో ఆఫీసరుగా చేరాడు. అన్ని చోట్లకి భార్యని కూడా తీసుకెళ్ళే ఏర్పాటు చేశాడు వెంకటరత్నంగారు ప్రారంభంలోనే మంచి జీతం.

సుబ్బలక్ష్మి మీద విసుక్కుని బయటికి వెళ్ళిపోయిన సుధాకరం హోటల్లో కూర్చుని కాఫీ త్రాగడం మొదలెట్టాడు. ఎదురుగా అద్దంలో తను కనబడుతున్నాడు. పెళ్ళినాడులేని ఠీవి, రంగు ఈ ఏణ్ణర్ధంలో వచ్చాయి. తను ఎంచదగిన అందగాడు. సందేహంలేదు. సుబ్బలక్ష్మి ఎందుకేడుస్తోందో, ఇంట్లో ఎవరైనా అన్న మాటల్లో ఆమెకి తనని అవమానిస్తున్న ధ్వని వినబడి వుంటుంది. ఆమె అందచందాలలో సుధాకరానికి ఏ విధంగానూ పోలదని అనడమే ఆ అవమానం.

ఇంట్లోంచి రెండు ఫర్లాంగులు గబగబ నడిచివచ్చి, మెల్లిగా వేడి కాఫీ త్రాగుతోంటే ఆవేశం లేకుండా ఆలోచించగలుగుతున్నాడు సుధాకరం. తను మనస్ఫూర్తిగా వప్పుకునే కదా సుబ్బలక్ష్మిని పెళ్ళాడాడు? ఆమె అందం విషయంలో వాళ్ళు దాచింది ఏమీలేదు. తన మెడకు బలవంతాన కట్టిందీ లేదు. అమ్మకీ, చెల్లెకీ బాధగానే వున్నా తను వప్పుకున్నాడు పెళ్ళికి. వాళ్ళిచ్చే కట్నం, యిప్పించే ఉద్యోగం చూసి వప్పుకున్నాడు. కానీ తనకి సుబ్బలక్ష్మి నిజంగానే నచ్చిందన్నట్లు ప్రవర్తించాడు అప్పుడు. అందర్నీ నమ్మించగలిగాడు ముఖ్యంగా నాన్నని. ఇంక తనూ ఆమె మీద విసుక్కోవలసిన అవసరం ఏముంది?

ఇందాక తను ఆమెపట్ల అన్యాయంగా ప్రవర్తించాడు. చాలా పొరబాటు. తన చదువు, వివేకం, మంచితనం అన్నీ ఏమైపోయినాయి? అందరిలాగే తనూ అన్నాడు ఆమెని "నీ ముఖం బాగుండదని"

ఇంటికి చేరిన తర్వాత సుధాకరం ముభావంగా వున్నాడు. ఎర్రబడిన కళ్ళతో, చిన్నబుచ్చుకున్న ముఖంతో పనులు చేసుకుంటోంది సుబ్బలక్ష్మి. అల్లాగే నిద్రకూడా పోయింది. సుధాకరానికి మాత్రం నిద్రపట్టలేదు.

తను ఎవరినైతే ఉద్ధరించడానికి, తన సుఖం త్యాగం చేసుకుని ఈ అమ్మాయిని కట్టుకున్నాడో, వారే ఈమెనిప్పుడు కించపరుస్తున్నారు. తను సుఖం త్యాగం చేశాడా? తనకిప్పుడు

వచ్చిన లోటు ఏమిటి? నెత్తిన పడిన బాధ్యతలు సులభంగా దింపుకోవడానికి సుబ్బలక్ష్మి సాయపడింది! తనకి అంత బరువు ఎందుకు పడిందిమీద? చెల్లాయిల పెళ్ళిళ్ళు, తమ్ముడి చదువు, నాన్న అప్పులూ-అన్నీ కలిసి, ఈ పెద్ద కుటుంబానికి పెద్ద కొడుకుగా తను ఆధారం కనుక భారం పడింది. మరి కోడలిగా తనూ బరువు నెత్తిన వేసుకుంటోందిగా పరాయి అమ్మ కన్న బిడ్డ, ఈ సుబ్బలక్ష్మి?

ఆమెవంక పరీక్షగా చూశాడు. మూసుకున్న కళ్ళ మీద కాటుక కనబడుతోంది. కనుబొమలు దిద్దినట్లుగా వున్నాయి. నిద్రపోతున్న ఆ కళ్ళల్లో ఏమి స్వప్నాలు చిత్రాలవలె కదులుతున్నాయో! ఇంకా కలలేమిటి? పెళ్ళి కోసం వెదకి, వేసారిపోయిన ఆమె కలలన్నీ నిజాలై, వరాలై కూచున్నాయికదా? ఆమె కలలు పండాయి.

కళ్ళు తెరిచింది సుబ్బలక్ష్మి. తన పక్కన కూర్చుని ముఖంలోకి చూస్తున్న భర్తను చూసి ఉలిక్కిపడింది. సిగ్గు, ఆశ్చర్యం కనపడ్డాయి కళ్ళల్లో. కానీ అవి ఒక్క త్రుటి మాత్రమే. బాధ, బెదురు, గాఢంగా దెబ్బతిన్నట్లు కనపడ్డాయి. పద్దెనిమిది నెలలు, కాదు ఐదువందల యాభై రోజులు తనతో కలసి బ్రతికిన మనిషికి తనని చూస్తే యింత భయం వచ్చింది- ఎవరినో గొప్పవాడిని, పరాయివాడిని, శత్రువుని చూసినట్లు చూస్తోంది. జాలితో అతని కళ్ళు చెమర్చాయి.

"పడుకో లక్ష్మీ- ఊరికేనే చూస్తున్నాను."

"మీరు నిద్రపోలేదా యింకా?" అన్నది మెల్లిగా.

"లేదు. నిద్రపో నువ్వు" అన్నాడు. అతనికి తెలుసు- తనిల్లా ఎదురుగా ఇనస్పెక్టరులా, యజమానిలా, ప్రేక్షకుడిలా కూర్చుంటే ఆమె నడుం వాల్చదని.

"నేను వెళ్ళిపోయాక చాలా సేపు ఏడ్చావా!" అన్నాడు ప్రేమగా. ఆమె ముఖం ప్రక్కకు త్రిప్పుకుని నేలని చూడాలని ప్రయత్నిస్తోంది.

"నేనలా అనడం చాలా తప్పయి పోయింది లక్ష్మీ! ఏమీ అనుకోకేం!" అన్నాడు. ఆమె మాట్లాడకపోయేసరికి ముఖం బలవంతాన తనవేపు త్రిప్పుకున్నాడు. ఆమె కళ్ళ వెంబడి నీరు కారుతోంది. ఆపుకున్న దుఃఖంవల్ల పెదవి వణుకుతోంది. ఈమెనింత బాధ పెట్టడానికి హక్కు ఎవరిచ్చారు!

"వద్దు లక్ష్మీ - యింకానా, ఆగవూ?" అన్నాడు.

"ఎందుకు బాధపడ్డావు సాయంత్రం- చెప్పవూ! ఎవరేమన్నారు?" అన్నాడు.

చెప్పమని చాలా బ్రతిమాలగా ఆమె "ఏమీలేదు. మీరు నాకోసం చాలా త్యాగం చేశారు- నేను మీకు తగిన దాన్ని కాదు" అన్నది.

"పిచ్చిదానా! ఎప్పుడూ యిదేమాటా! చూడు. నా తర్వాత యింతమంది వున్నారు. అందరిసంగతీ నేనే కావు

మనమే చూడాలి. ఈ బాధ్యత అంతా నేనొక్కణ్ణే భరించగలనా? లక్ష్మీ, నువ్వే నాకోసం త్యాగం చేశావు. చిన్న పిల్లవి. ఆటపాటగా జీవితం గడపాలని కలలుగన్న దానివి. పెద్దదానిలా యివన్నీ తలమీద కెత్తుకున్నావు. సంతోషంగా, ఒక్క పరుషవాక్కు పలుకకుండా ఎత్తుకున్నావు, అందుకు నేనే నీకు ఋణ..."

"ఊరుకోండి, పెద్దమాటలు" అన్నదామె. కానీ మొదటిసారిగా ఆమె కళ్ళల్లో ఒక తృప్తి, భర్త తననొక పెన్నిధిగా భావించి గౌరవిస్తున్నాడన్న సంతృప్తి తొంగి చూశాయి. ఇద్దర్నీ దూరంచేసిన అగాధం ఏదో ఈవేళ మాయమైనట్లు అనిపించింది పాతికేళ్ళు రాని ఆ సతీపతులకు.

**